సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు

కాకినాడ సిటీ: సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ వ్యాధుల నివారణకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ కె.రమేష్, జెడ్పీ సీఈవో ఎ. రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

కాకినాడ రూరల్: ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలని నియోజవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ వద్ద మండల పరిషత్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ నెల 21న క్షేత్ర స్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతుందన్నారు.

ఇంటి వద్దకే ధ్రువపత్రాలు

- జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ప్రస్తుతం విద్యా సంవత్సరంలో ఉన్నత చదువులకు అవసరమయ్యే కుల, ఆదాయ, నివాస వంటి ధ్రువీకరణ పత్రాలు వలంటీర్ ద్వారా నమోదు చేయించుకుని జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దనే పొందవచ్చునని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. నియోజవర్గ పరిధిలోని కాకినాడ 2వ డివిజన్ కృష్ణనగర్‌లో సచివాలయం - 2 వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా టోకెన్ ఐడీలను పొంది నెలాఖరు వరకు కావలసిన సర్టిఫికెట్లు పొందవచ్చని అన్నారు. చెప్పిన విధంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని, తనను మరో సారి ఆశీర్వదించాలన్నారు. తహసీల్దార్ సీతాపతిరావు, డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు పాటి సూరిబాబు, గుత్తుల సూర్య ప్రకాశరావు, మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్ పాల్గొన్నారు.

పాతర్లగడ్డలో..

కరప: మండలం పాతర్లగడ్డలో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరాన్ని సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు ప్రారంభించారు. అధికారులు, నాయకులతో కలసి 400 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, జెట్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జి.భావారం సర్పంచ్ రొక్కాల గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



కృష్ణానగర్‌లో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

దుస్తులు, పుస్తకాల వితరణ

కాకినాడ క్రైం: నగర ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శ్రీ యువసేన స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహించింది. శుక్రవారం రిలయన్స్ స్మార్ట్ సమీపంలోని డి కన్వెన్షన్ హాల్లో ఆ సంస్థ, శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్ వ్యవస్థాపకుడు బొల్లం సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఏ ద్వారంపూడి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అతిథులుగా హాజరయ్యారు. కంపర వీణారావు మున్సిపల్ పాఠశాల, జగన్నాథపురం బీసీ హాస్టల్‌లో 200 మంది విద్యార్థులకు నూతన వస్త్రాలు, నోట్ బుక్స్, పోషకాహారం పంచారు. సతీష్ మాట్లాడుతూ ఇద్దరు చిన్నారుల ఆరోగ్యం నిమిత్తం రూ.25 లక్షలు, రూ.18 లక్షల చొప్పున ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం ఇప్పించారని, అందుకు కృతజ్ఞతగా ఆయన పుట్టిన రోజుని పురస్కరించుకొని విద్యార్థులకు వస్త్రాలు, పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంఎల్‌ఏ ద్వారంపూడి మాట్లాడుతూ, శ్రీ యువసేన పేదలకు అండగా నిలుస్తున్న తీరుని కొనియాడారు. ఎంఎల్‌సీ కర్రి పద్మశ్రీ, కొడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, పార్టీ నాయకురాలు పేపకాయల కృష్ణ ప్రియ, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, కర్రి చిన బాబు, జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో అపూర్వ ఆదరణ

కాకినాడ: స్థానిక జగన్నాథపురం 21వ డివిజన్ జె.రామారావుపేటలోని షరీఫ్‌వీధి, మక్కా మస్జిద్ ప్రాంతంలో ఎమ్మెల్యే ద్వారంపూడి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ కార్పొరేటర్ బొర్రా రమణ, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.



విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి, వీరభద్రారెడ్డి

విద్యారంగానికి మహర్దశ

స్థానిక జగన్నాథపురం 26వ డివిజన్‌లోని నున్నవారి వీధిలో రూ.90 లక్షలతో నిర్మించిన రావెళ్ల బంగారమ్మ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రారంభించారు. విద్యారంగానికి సీఎం జగన్ పెద్దపీట వేయడంతో ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడిందన్నారు. దాత ఆశయానికి అనుగుణంగా పాఠశాల మరింత అభివృద్ధి చెందాలని, ఇందుకు తన వంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

శాకంబరిగా అమ్మ దర్శనం

బోట్‌క్లబ్/కాకినాడ రూరల్: కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో పలు ఆలయాల్లోని అమ్మవార్లను శాకంబరిగా అలంకరించి దర్శనం కల్పించారు. స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులతో పాటు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అమ్మవారిని దర్శించుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయనతో పాటు రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పసుపులేటి వెంకటలక్ష్మి, సుంకర శివప్రసన్న పాల్గొన్నారు. సంతచెరువు వద్దనున్న కనకదుర్గమ్మ అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. వాకలపూడి సంతోష్‌నగర్‌లో విజయకనక దుర్గమ్మను ఆలయ అర్చకుడు మోదకొండల శర్మ అందంగా అలంకరించారు. అలాగే రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఇంద్రపాలెం ప్రాంతాల్లోని అమ్మవార్లు శాకంబరిగా దర్శనమిచ్చారు.



అమ్మవారి ప్రసాదం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

ఇంజినీరింగ్ విద్యార్థులకు ముగిసిన శిక్షణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఫ్రంట్ ఎండ్ వెబ్ డిజైనింగ్‌పై ఐదు రోజుల శిక్షణ శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, ఇన్ఫోసిస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి

- కరపలో రూ.10.45 కోట్ల అమ్మఒడి నిధుల పంపిణీ

కరప: కుటుంబ ప్రగతి, తద్వారా దేశాభివృద్ధి సాధించాలంటే విద్యే మూలమని, అందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకోసం వేలాది కోట్ల రూపాయలు ఖర్చుచేసి, విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక చిరంజీవి కళ్యాణ మండపంలో శుక్రవారం తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమపిల్లలను పనిలోకికాకుండా బడికి పంపాలన్నారు. మండలానికి మంజూరైన రూ 10.45 కోట్లు చెక్‌ను ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి,ఎంఈఓ-2 ప్రత్తి సత్యనారాయణ 6,970 మంది తల్లులకు అందజేశారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

కాకినాడ కల్చరల్: అల్లూరి సీతారామరాజు నాటక పరిషత్ చేస్తున్న కళారంగ సేవలు అభినందనీయమని సంఘసేవకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.శుభశేఖర్ అన్నారు. స్థానిక సూర్యకళామందిర్‌లో పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటికల పోటీల్లో భాగంగా శుక్రవారం ముందుగా తిరుపతికి చెందిన శ్రీశృంగార వల్లభ ఆర్ట్స్ సమర్పణలో కె.బ్రహ్మానందం దర్శకత్వంలో 'కబ్జా' నాటిక ప్రదర్శించారు. అనంతరం తాడేపల్లికి అరవింద ఆర్ట్స్ వారు గంగోత్రి సాయి దర్శకత్వంలో 'మనస్విని' నాటికను, విశాఖకు చెందిన ఉక్కు కళా స్రవంతి సమర్పణలో డి.సత్యనారాయణ దర్శకత్వంలో 'అమ్మ.. మారిపోయింది' నాటికలను ప్రదర్శించారు. డాక్టర్ ఎస్.మాధురి, పరిషత్ అధ్యక్షులు కర్రి అచ్యుతరామారెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు, మురళి, జానకిరామ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై చర్యలు చేపట్టండి

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ శుక్రవారం ఓటర్ల నమోదుపై ఏఈఆర్వో, సూపర్‌వైజర్లు, ఎన్నికల అధికారులతో ఆయన కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అలాగే నగర పరిధిలోని ప్లాంటేషన్‌పై సంబంధిత అధికారులతో చర్చించి మొక్కలను అభివృద్ధి చేయాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీలపై తగ్గిన దాడులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: సామరస్య భావన, చట్టాలపై పెరిగిన అవగాహనతో డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై దాడులు గణనీయంగా తగ్గాయని ఆర్డీవో ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో డివిజన్ స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది.
రెవెన్యూ, పోలీస్ అధికారుల మధ్య సమన్వయం, డివిజన్, జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ కమిటీ సభ్యుల కృషితో ఈ ప్రగతి సాధ్యమైందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 13 అట్రాసిటీ కేసులు నమోదవగా రూ.3.5 లక్షల సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. డీఎస్పీ కె.మురళీకృష్ణారెడ్డి, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్టిఫికెట్ల పంపిణీ

కాకినాడ సిటీ: స్థానిక కృష్ణానగర్-2బి, కుమ్మరిపేట-17ఏ సచివాలయాల పరిధిలో నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల అధ్యక్షతన జగనన్న సురక్ష నిర్వహించారు. 262 మందికి టోకెన్లు జారీ చేసి సర్టిఫికెట్లు అందజేసినట్టు తెలిపారు.

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

కరప: వాహనాలు నడిపేవారు నిబంధనలు పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డుప్రమాదాలు జరగవని ఎస్ఐ నౌడు రామకృష్ణ అన్నారు. వారధి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి పాతర్లగడ్డలో గ్రామస్తులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. రహదారి భద్రత నియమాలను వివరించారు.